**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేది.01.05.2021.**

## రాహుల్ జ్యూవలరీ షాపులో పని చేస్తూ తన యజమని కళ్ళు కప్పి భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు దొంగతనానికి పాల్పడిన నిందితుని అరెస్ట్

ది.27.04.2021వ తేదీన ఉదయం సుమారు 12.00 గంటల సమయంలో గవర్నర్ పేట, జైహింద్ కాంప్లెక్స్‌లో గత రాహుల్ జ్యూవలరీ షాపులో ఉద్యోగిగా పని చేసే బొబ్బిలి వెంకట హర్ష షాపు యజమాని అయినటువంటి మహావీర్‌కు తెలియకుండా రాహుల్ జ్యూవలరీ షాపు అదే కాంప్లెక్స్‌లో 5వ అంతస్తులో ఉన్న తన నివాసంలో ఉండే ఆయన భార్య వద్దకు వెళ్ళి రెండు బ్యాగుల నిండా ఉన్న బంగారు ఆభరణాలు సుమారు 10 కేజీల బంగారమును దొంగతనము చేసి పారిపోయిన దరిమిలా, విజయవాడ నగర పోలీస్ కమీషనర్ శ్రీ బి.శ్రీనివాసులు, ఐ.పి.ఎస్., గారి ఆదేశాల మేరకు డి.సి.పి. శ్రీ విక్రాంత్ పాటిల్, ఐ.పి.ఎస్., మరియు క్రైమ్ ఏ.డి.సి.పి. శ్రీ ఎమ్.సుభాష్ చంద్రబోస్ గారి పర్యవేక్షణలో మరియు సి.సి.ఎస్. ఏ.సి.పి. శ్రీ కొల్లి శ్రీనివాసరావు మరియు గవర్నర్ పేట ఇన్‌స్పెక్టర్ శ్రీ నాగరాజు గార్ల ఆధ్వర్యంలో భారీ దొంగతనానికి పాల్పడిన బొబ్బిలి వెంకట హర్ష ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ నేపథ్యంలో ది.01.05.2021వ తేదీన విజయవాడ సి.సి.ఎస్. పోలీసు వారికి రాబడిన సమాచారం మేరకు పెనమలూరు, తాడిగడప డొంక రోడ్ పరిసరాలలో సంచరిస్తున్న బొబ్బిలి వెంకట హర్షను విశ్వసనీయ వర్గాల సమాచారము మేరకు మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించడం జరిగింది.

**<u>నిందితుని వివరాలు:</u>**

1) శ్రీకాకుళం జిల్లాకు చెందిన బొబ్బిలి వెంకట హర్ష.

విచారణలో...నిందితుడు 10వ తరగతి వరకు చదువుకుని డిగ్రీ ప్రైవేట్‌గా చదువుతూ మధ్యలో ఆపివేసి, తన తల్లిదండ్రులు చిన్న తనంలోనే చనిపోవడంతో తన పెద్దమ్మ అయిన బొబ్బిలి ప్రభావతి వద్ద ఉండి చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ వుండేవాడు. తనకు చిన్న తనం నుండి జ్యూవలరీ షాపులలో పని చేసిన అనుభవంతో విజయవాడ, గవర్నర్ పేట, జైహింద్ టాకీస్ కాంప్లెక్స్, రాహుల్ జ్యూవలరీస్‌కు చెందిన మహావీర్ జైన్ వద్ద గత సవంత్సరం నుండి పని చేస్తున్నాడు. షాపు యజమాని తనను పూర్తిగా నమ్మి రోజు జైహింద్ కాంప్లెక్స్ 5వ అంతస్తులో వుండే తన ప్లాట్‌కు వెళ్ళి బంగారం తీసుకుని రావడం మరియు తీసుకుని వెళ్ళి పెట్టడం అలాగే తన బ్యాంక్‌కు చెందిన లావాదేవీలు మరియు బ్యాంక్ పనులు తనకు చెప్పుతూ వుండేవాడు. షాపు యజమని తన మీద పెట్టిన నమ్మకాన్ని ఆసరాగా తీసుకుని భారీ దొంగతనానికి పాల్పడి ఎక్కడికైన వెళ్ళి భార్య పిల్లలతో స్థిరపడాలని నిర్ణయించుకుని, పథకం ప్రకారం అవకాశం కోసం ఎదురు చూస్తూ వుండగా ది.27.04.2021వ తేదీన తన యజమాని మహావీర్ అన్నయ్య గారికి కరోనా సోకడంతో మహవీర్ గారు షాపులో లేక పోవడాన్ని అధునుగా తీసుకుని ఆరోజు సుమారు 12.30 గంటల ప్రాంతంలో 5వ అంతస్తులో వుండే తన యజమాని ఇంటికి వెళ్ళి క్రింద షాపులోకి యజమాని గారు బంగారు ఆభరణాలు తీసుకుని రమ్మన్నారని వారి భార్యకు చెప్పి రెండు బ్యాగులలో వున్న సుమారు 10 కేజీల బంగారు వస్తువులను, అలానే యజమానికి చెందిన ఐ.డి.బి.ఐ. బ్యాక్ యొక్క ఖాళీ చెక్‌ను తీసుకుని పారిపోవడం జరిగింది.

**(మిగతాది తరువాత పేజీలో....)**

ముద్దాయి ముందుగానే భారీ బంగారం దొంగతనం చేయ్యాలని పథకం పన్ని దొంగతనం చేసిన తరువాత పోలీసులకు దొరకకుండా వుండేందుకు, ముందస్తుగా చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఈ క్రమంలో ముందస్తుగా తను ఉంటున్న ఇళ్ళు ఖాలి చేసి తను పూర్తి వివరములు ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడి, తనకు చెందిన ఫొటోలు, అడ్రస్సు ఇతర వివరములు షాపులో లేకుండా చేసి, స్నేహితులకు, బంధువులకు తన నివాసం ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడి, తన పథకంలో భాగంగానే ది.18.04.2021వ తేదీన కృష్ణలంక, రాణీగారి తోటలో నివాసం వుండే నిందితుడు అప్పటికప్పుడు రాత్రి సమయంలో ఇళ్ళు ఖాలి చేసి పెనమలూరు, తాడిగడప డొంకరోడ్డులో ఇల్లును అద్దెకు తీసుకుని తన భార్య మరియు తన 7 నెలల కొడుకు, పెద్దమ్మను అక్కడ వుంచి, యథాప్రకారం షాపుకు వెళ్ళుతూ షాపులో వారికి ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరించి, అదును చూసి ది.27.04.2021వ తేదీన యజమాని ఇంటికి వెళ్ళి సుమారు 10 కేజీలు బంగారు ఆభరణాలు కల్గిన రెండు పెద్ద బ్యాగ్‌లను తీసుకుని తన కదలికలను పోలీసు వారు గుర్తు పట్టకుండా ఒక షేర్ ఆటోలో విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాలలో తిరిగి సాయంత్రం సమయంలో తాడిగడప డొంకరోడ్డులోని తను అద్దెకు ఉంటున్న ఇంటికి చేరుకోవడం జరిగింది. తరువాత ఈ బంగారు వస్తువులతో వేరే రాష్ట్రం ఎక్కడికైనా వెళ్ళి స్థిరడాలని నిర్ణయించుకుని అందుకు కావలసిన నగదు కొరకు తను దొంగలించిన నగలను విజయవాడలో అమ్మినట్లైయితో తెలిసిపోతుందని మరనాడు అనగా ది.28.04.2021న స్టెల్లా కాలేజ్ వద్ద ఉన్న ఐ.డి.బి.ఐ. బ్యాంక్ వద్దకు వెళ్ళి తాను షాపులో దొంగిలించిన ఖాళీ చెక్‌పై తన యజమాని యొక్క సంతకాన్ని పోర్జరీ చేసి తన అకౌంట్‌కు రూ.4,60,000/-లకు ఆర్.టి.జి.ఎస్. చేసి, మధ్యహ్నాం 1 గంటకు పోరంకిలోని ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్‌కు వెళ్ళి తన సెల్ఫ్ చెక్‌తో రూ.4,60,000/-లు డ్రా చేసుకుని తన ఇంటిలో పెట్టుకోవడం జరిగింది. ఈ రోజు తన కుటుంబంతో సహా ఎక్కడికైనా వెళ్ళి పోవడానికి ప్రయత్నాలు చేస్తూ వుండగా పోలీసు వారు నిందితుడిని పట్టుకోవడం జరిగింది.

**ఈ కేసులో నిందితుడు దొంగతనం చేసిన మొత్తం 10 కేజీల బంగారపు వస్తువులను మరియు బ్యాంక్ నుండి పోర్జరీ చేసి డ్రా చేసిన నగదు రూ.4,60,000/-లను ముద్దాయి వద్ద నుండి యధాతదంగా స్వాధీనం చేసుకోవడం జరిగింది. మొత్తం స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు విలువ రూ.4.5 నుండి 5 కోట్ల గా వున్నది.**

ఈ సందర్భంగా భారీ దొంగతనానికి పాల్పడిన నిందితుడిని గుర్తించి 48 గంటలలోనే పట్టుకున్నందుకు సి.సి.ఎస్. మరియు గవర్నర్‌పేట సిబ్బందిని పోలీస్ కమీషనర్ శ్రీ బి.శ్రీనివాసులు, ఐ.పి.ఎస్. గారు అభినందించడం జరిగింది.

--x--